క్లుప్తంగా

వాలీబాల్ అకాడమీ ఏర్పాటు



విలేకరులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కాళ్ల: వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు వాలీబాల్ అకాడమీ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు తెలిపారు. ఈ మేరకు కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాజీ వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోపల్లె గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు శివాజి రాజు పేరు మీద అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. జిల్లాలో గ్రామాల వారిగా యువతకు వాలీబాల్ కిట్లను అందజేసి క్రీడాభివృద్ధికి అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సభ్యులు వైఎస్ఆర్సీపీ నాయకులు పెనుమత్స విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన డీపీవో

సాక్షి, భీమవరం : జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా బాధ్యతలు చేపట్టిన జి.మల్లిఖార్జునరావు మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఉండి ఏఎంసీ చైర్మన్‌గా కడలి శ్రీనివాస్



కడలి శ్రీనివాస్

ఉండి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా మహదేవపట్నం గ్రామానికి చెందిన కడలి శ్రీనివాస్ నియమితులైయ్యారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుండి తనకు నియమాకపత్రం అందినట్లు ఆయన మంగళవారం విలేకరులకు వివరాలు తెలిపారు. ఏఎంసీ నూతన కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశమిచ్చిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు, ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పీవీఎల్‌ను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.అలాగే ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చైర్మన్ తెలిపారు.

ఉండి ఏఎంసీ నూతన కమిటీ ఇదే

చైర్మన్‌గా కడలి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా చేకూరి రాజానరేంద్రకుమార్, డైరెక్టర్‌లుగా నిమ్మల సత్యనారాయణ, కానుబోయిన నాగమణి, బొడ్డు రామకృష్ణ, గుండు నాగేశ్వరరావు, సిరికి కుమారి, అంగర భాగ్యలక్ష్మీ ,షేక్‌రేష్మ బీబీ, ఆదాడ వెంకటరమణ, బుంగా ఆదాము, గెద్దం మార్త,జంపా నాగేశ్వరరావు, గొట్టుముక్కల బంగారమ్మ, బొడ్డు నాగన్న నియమితులయ్యారు.

సీసీ రహదారి పనుల ప్రారంభం

వీరవాసరం : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సర్పంచ్ పంజా రమా వరలక్ష్మి అన్నారు. పంజా వేమవరం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. సీసీ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంజా మంగతాయారు, పంజా జానకిరామయ్య, పంజా శ్రీనివాస్‌బాబు. ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీవారికి అష్టోత్తర కలశాభిషేకాలు

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారికి అష్టోత్తర కలశాభిషేకాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, అమ్మవారికి లక్ష్మీ హోమం, సహస్ర దీపాలంకరణ, అష్టదళ పాద పద్మారాధన, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఆలయ చైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యుడు మంతెన రామ్ కుమార్ రాజు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆకివీడు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మంగళవారం ప్రమాదవశాస్తూ ట్రాక్టరను మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. సంఘటనలు మోటార్ సైకిల్ లిస్టు పక్కకు దూకి వేయడంతో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని స్థానికులు చేరుకుని చేరుకుని మోటార్ సైకిల్‌ను ట్రక్కు నుంచి తొలగించారు. ఘటనలో ఎవ్వరికీ గాయాలుకాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలు

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం కారు ఢీకొని మోటార్‌సైక్లిస్ట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దేగాపురం గ్రామానికి చెందిన గుత్తుల రామకృష్ణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి మారుతీకారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు భీమవరం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోడల్ సిటీగా భీమవరం అభివృద్ధి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పట్టణ సుందరీకరణ పనులకు శంకుస్థాపన పూజలు చేస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



సీసీ రోడ్డుగా నిర్మించిన బైపాస్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని, ఇందుకు సహకరిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతికి భీమవరం పట్టణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం రెండవ పట్టణంలోని అడ్డ వంతెన వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ పార్కుకు కాస్మో పాలిటిన్ క్లబ్ తరపున రూ.25 లక్షల సౌజన్యంతో చేపట్టిన సుందరీకరణ పనులకు కలెక్టర్ పి ప్రశాంతితో కలిసి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం శంకుస్థాపన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రం అయిన నేపథ్యంలో కలెక్టర్‌గా వచ్చిన పి. ప్రశాంతి మున్సిపాలిటికి కూడా ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారని, ఈ నేపథ్యంలో పట్టణ అభివృద్ధికి ఆమె తన వంతు సహకారం అందించడంతో అటు అభివృద్ధి పనులు, ఇటు పట్టణ సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు దాతలు ముందుకు వస్తున్నారన్నారు. అందులో భాగంగా ఇప్పటికే వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడమే కాకుండా ఆసుపత్రి నిర్మాణానికి తమ కుటుంబం తరపున నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. తాజాగా రెవెన్యూ అధికారుల కోరిక మేరకు ప్రభుత్వ గెస్ట్ హౌస్ నిర్మాణానికి గ్రంధి సాగర్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ నుంచి రూ.3 కోట్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎడ్వర్డ్ ట్యాంక్ సుందరీకరణకు ఎన్ఆర్ఐ జూపూడి సంజయ్ రూ.34 లక్షలు, వంశీకృష్ణ మునిసిపల్ పార్క్ అభివృద్ధికి వర్టిక్స్ వర్మ రూ.50 లక్షలు, ఆదర్శ్ నగర్ పార్కు అభివృద్ధికి శ్రీ వివేకానంద ట్రస్ట్ వి.శివ వర్మ రూ.25 లక్షలు, అంబేద్కర్ చౌక్ ట్రాఫిక్ ఐలాండ్ అభివృద్ధికి ఎస్ఆర్‌కేఆర్ కళాశాల రూ.18 లక్షలు, బైపాస్ రోడ్డు నందు క్లాక్ టవర్, పోలీస్ ఔట్ పోస్ట్, కంట్రోల్ ఫ్లడ్ లైటింగ్ అభివృద్ధికి లయన్స్ క్లబ్ రూ.20 లక్షలు, సర్ అర్థర్ కాటన్ పార్క్ అభివృద్ధికి కాస్మోపాలిటన్ క్లబ్ రూ.25 లక్షలు, రాయలం జంక్షన్, పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర ఉండి రోడ్డు, అభిరుచి హోటల్ సెంటర్ డీఎన్ఆర్ కాలేజీ రోడ్, భీమవరం హాస్పిటల్ జంక్షన్ జేపీ రోడ్డు వద్ద నిర్మించే మోడరన్ బస్సు షెల్టర్లకు మరో రూ.20 లక్షలను సీహెచ్ బోసిరాజు, చేకూరి రామచంద్రరాజు, శివరంజని హాస్పిటల్, చిలుకూరి కృష్ణంరాజు అందిస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తుమన్నారు.

బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్ పేరుకు కృషి

బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్‌గా నామకరణం చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ యార్డ్‌లో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఈ బైపాస్ రోడ్డు ప్రజలకు చాలా కీలకంగా మారుతుందని ఆయన అన్నారు. రూ.3.65 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు జడ్డు బ్రహ్మాజీ కళ్యాణ మండపం వద్ద నుంచి బీవీ రాజు బొమ్మ వరకు నిర్మాణం చేసిన సీసీ, బీటీ రోడ్‌ను మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం సీఎస్ ఆర్ ఫండ్స్ నిధులు క్రింద లయన్స్ క్లబ్ తో కలసి రూ.20 లక్షలతో ఏర్పాటు కానున్న బైపాస్ రోడ్‌లో క్లాక్ టవర్, పోలీస్ అవుట్ పోస్ట్, కంట్రోల్ ఫ్లడ్ లైటింగ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పీవీ నరసింహారాజు హయంలో గతంలో ఉండి రోడ్డు నుంచి తాడేపల్లిగూడెం రోడ్డుకు బైపాస్ రోడ్డు మంజూరు కాగా, తన హయంలో యనమదుర్రు డ్రెయిన్ పై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో ఆయన సహకారంతో వంతెన నిర్మించి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డును నిర్మించినట్లు చెప్పారు. అయితే ఈ రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారని, ఈ నిధులతో బైపాస్ రోడ్డు పటిష్టం చేయడం జరిగిందని అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సహకారంతో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ప్రమాణం చేసే రోజునే డైనమిక్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. భీమవరం జిల్లా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, కాస్మో పాలిటిన్ క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, పెన్మెత్స వెంకటరామరాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, డీఈ తోట నారాయణరావు, ఆర్అండ్‌బి డీఈ రామరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహారాజు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, మానేపల్లి నాగన్నబాబు, తోట ఫణి, అల్లూరి భాస్కర్‌రాజు, పట్టా వెంకట నరసింహారావు, జేసీఎస్ కన్వీనర్లు గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, నల్లం రాంబాబు, చెల్ల బోయిన సూర్యప్రకాష్, కోమటి రాంబాబు, గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, షేక్ ఇమామ్, మల్లుల శ్రీనివాసరావు, బొక్కా గోపి, దాతలు, నాయకులు పాల్గొన్నారు.

భూములపై నాణ్యమైన రీ సర్వే చేయాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం : రీ సర్వేలో అందరూ భాగస్వాములై టీం వర్క్ చేస్తే నాణ్యమైన రీ సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులకు రీ సర్వేపై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రణాళిక బద్ధంగా రీ సర్వే చేయాలని అన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి నాణ్యమైన రీ సర్వే చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే మిరర్ ఇమేజ్, గ్రౌండ్ రియాలిటీ ప్రకారం జరగాలని, ప్రభుత్వ భూములకు గతంలో ఉన్న సరిహద్దులను మాత్రమే తీసుకోవాలని సూచించారు. పట్టా భూమి ఎవరైతే ఎంజాయ్ మెంట్‌లో ఉన్నారో సరిచేసుకోవాలి అన్నారు. రీ సర్వే చేసే సులువైన పద్ధతులను పవర్ పాయింట్ ద్వారా జేసీ వివరించారు. డీఆర్ఓ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్డీఓ దాసి రాజు, సర్వే లాండ్ రికార్డ్ ఏడీ జాషువా, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, వీఆర్వోలు, విలేజ్ సెక్రటరీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్రీడల్లో శిక్షణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెలాఖరు వరకు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ, ఫెన్సింగ్, తైక్వాండ్ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, పీడీ ఎం.శివనాగరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 72075 27443 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎం జగన్‌తో ప్రజలకు ఆర్థికాభివృద్ధి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



కలిగొట్లలో సంక్షేమ పత్రాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినాటి నుంచి రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం కలిగొట్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతలపాటి రఘుపతిరాజు, చింతలపాటి వెంకట్రామరాజు,సాగిరాజు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యత అతిథిగా పాల్గొన్న పీవీఎల్ ఇంటింటికీ వెళ్లి సంబందిత లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ గ్రామాలన్నీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం బాగుపడుతున్నాయన్నారు. సీసీరోడ్లు,ప క్కా డ్రెయిన్ల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధిలో ముందున్నాయన్నారు. వాటన్నింటికంటే ముఖ్యంగా సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఇంటికీ సుమారుగా రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కలిగొట్లలో ఎప్పటి నుంచో పరిష్కారం కాని వెంకయ్య వయ్యేరుపై వంతెన సమస్య, విద్యుత్ సమస్యను తాము పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ మహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రుద్రరాజు సుబ్బరాజు, ముదునూరి విశ్వనాథరాజు, చింతలపాటి బుజ్జి, చింతలపాటి ఆంజనేయరాజు, అద్దేపల్లి సూరపరాజు, దెందుకూరి అప్పలరాజు, శ్రీహరి రాజు, రుద్రరాజు శివరాజీరాజు, నీలం సింహాచలం , సప్ప వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధృతితో అధిక దిగుబడులు

- విదేశీ ఎగుమతులకు అనువైన వంగడం
- రబీలో విరగపండిన పంట
- జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో ఎంటీయూ 1121 సాగు



బరువైన కంకులతో విరగ పండిన శ్రీధృతి ఎంటీయూ 1121 వంగడం

ఆకివీడు: ఈ ఏడాది రబీ సాగులో పండించిన శ్రీధృతి వంగడం రైతుల కళ్లలో ఆనందం నింపింది. ఎంటీయూ 1121 రకం వంగడాన్ని రైతులు అమ్మోరుగా ముద్దుపేరు పెట్టుకున్నారు. 'అమ్మో'రు దిగుబడులు అంటూ అధిక దిగుబడుల్ని చూసి రైతు ఆనందపడుతున్నాడు. ఎకరాకు 50 నుండి 60 బస్తాల దిగుబడినిచ్చింది. 120 రోజుల్లోనే తక్కువ నీటితో ఎక్కువ పిలకలు, కంకులతో అధిక గింజలతో రైతుల పంట పండింది. తెగుళ్లు లేవు. అలాగే దోమ దరి చేరలేదు. యాంత్రీకరణతో కోతకు అనుకూలంగా పంట ఉంది. ఒక్కో కంకికి 240 నుండి 260 వరకూ గింజల దిగుబడి లక్ష్యం కాగా కొన్ని కంకులకు 300ల గింజలు కూడా ఉన్నాయి. గింజ రాలలేదు. మొక్క ఒంగలేదు. అధిక దిగుబడులతో పాటు ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గాయి. దీంతో ఎకరాకూ 10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఖర్చు ఆదా అయ్యింది.

ఎగుమతులకు అనుకూలమైన వంగడం

ఈ బియ్యం విదేశీ ఎగుమతులకు ఈ వంగడం అనుకూలమైనదని రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైస్ మిల్లర్లు చెబుతున్నారు. మార్టేరు వరి పరిశోధనా శాస్త్రవేత్త పాలడుగు వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో 2005లో ఈ వంగడం తయారీకి రూపకల్పన చేశారు. బీపీటీ 5204 రకం వంగడం, ఎంటీయూ బీబీ 24ను క్రాస్‌చేసి నూతన వంగడాన్ని రూపొందించారు. మధ్యస్థరకంగా ఉండే బియ్యంను తినేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు.

జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో సాగు

శ్రీధృతి రబీ వంగడం జిల్లాలో ఈ ఏడాది 1.85 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఎకరాకూ 55 బస్తాల నుంచి 60 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. మరి కొన్ని ప్రాంతాల్లో 48 బస్తాల నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. సరాసరి దిగుబడి 50 నుంచి 52 బస్తాలుగా అంచనా వేశాం. అధిక దిగుబడులతో రైతులు ఆనందిస్తున్నారు.

– జెడ్. వెంకటేశ్వర్లు, వ్యవసాయ సంయుక్త సంచాలకులు, పశ్చిమగోదావరి జిల్లా

వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక అలంకరణలో శ్రీస్వామివారు, అమ్మవార్లు



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్న పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. కాళ్లకూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి శ్రీస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వగా గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యుల వేదమంత్రాలు నడుమ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, స్రవంతి దంపతులతో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేసింది. కార్యక్రమంలో ముందుగా డీసీసీబీ చైర్మన్ పీవీ ఎల్ నరసింహరాజు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీ స్వామివారికి నిత్యార్చన, బలిహరణ, నిత్యోపాసన, శ్రీ స్వామి అమ్మవార్లకు మల్లెపుష్పాలతో సహస్రనామ పుష్పార్చన నీరాజన మంత్రపుష్ప కార్యక్రమలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివారికి వేద మంత్రోచ్ఛారణల మధ్య శేష వాహన సేవ గ్రామోత్సవం జరిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమదుర్రు గ్రామానికి చెందిన నక్కా పేతూరు (35) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండేవాడు. గత నెల 30న నక్కా పేతూరు గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ అవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, బంధువులు భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. నక్కా పేతూరు సోదరి పాలపర్తి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పేతూరు భార్య గల్ఫ్ దేశంలో పనిచేస్తూ డబ్బులు పంపుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

రెజ్లర్ల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ మద్దతు



భీమవరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : మహిళా రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీకి చెందిన ఎంపీ బ్రిజు భూషణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడలో ఒలింపిక్ మెడల్స్ సంపాదించి దేశానికి ప్రతిష్ట తెచ్చిన రెజ్లర్ పహిల్వాన్లపై లైంగిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. భూషణ్ సింగ్‌పై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని తొమ్మిది రోజులుగా ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బి ఆంజనేయులు మాట్లాడుతూ బీజేపీ దుర్మార్గ పరిపాలన సాగుతోందని తక్షణమే ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, జె.సత్యనారాయణ, ప్రమోద్, వినోద్, పి.మోహిని, బి.గణేశ్, యం.శివ, సీహెచ్ శాంతి, ఐ.షరానో, పల్లవి, జాను, అర్జున్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

4న పెద అమిరంలో జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం : కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో ఈనెల 4వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్ సహకారంతో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి.మధుభూషణంరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్కార్ట్ కంపెనీలో డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం జాబ్ డ్రైవ్ జరుగుతోందని, టెన్త్ అపై విద్యార్హత కలిగిన యువతీ, యువకులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 93935 75353 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోషకాహారం పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్) : పాజిటివ్ పీపుల్స్ సొసైటీ ఆధ్వర్యంలో డి.భీమవరం నవ చైతన్య ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ వారి ఆర్థిక సహాయంతో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో పాజిటివ్ పీపుల్స్ సొసైటీ అధ్యక్షుడు ఎ.భాస్కరరావు, సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్, నవ చైతన్య ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు దుండి శ్యామల రాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

కాళ్ల: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కాళ్ల మండల కార్యదర్శుల అధ్యక్షులుగా ఎన్నికైన జక్కరం షేక్ జమాల్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా కాళ్ల పంచాయితీ సెక్రటరీ సతీష్, కార్యదర్శిగా సుజాత ట్రెజరర్‌గా ఏసుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. గౌరవ అధ్యక్షులుగా సత్యనారాయణ ఉంటారన్నారు.

నేడు కలిగొట్లలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: కలిగొట్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం రెండవ రోజు కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు చింతలపాటి రఘుపతిరాజు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొంటారని, వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఎంపీపీల సమావేశానికి హాజరుకండి

ఉండి: భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా ఎంపీపీల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులంతా తప్పక పాల్గొనాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ...ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: మద్యం మత్తులో బైక్ నడుపుతూ, ఎదురుగా మరో బైక్ పై వస్తున్న కానిస్టేబుల్‌ను ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాల ప్రకారం పాలకోడేరు పోలీస్‌స్టేషన్ లో పని చేస్తున్న బాలకృష్ణ అనే కానిస్టేబుల్ మంగళవారం మధ్యాహ్నం భోజనానికి స్వగ్రామం ఆరవల్లి బైక్ పై వెళ్తుండగా, ఎదురుగా బైక్ పై వస్తున్న బొబ్బనపల్లి సునీల్ ఢీ కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వారిద్దరినీ భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఢీ కొన్న యువకుడు వెంప గ్రామానికి చెందిన వాడని, మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com